AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
27-11-2025 (Thursday)
MAIN EDITION

## హైదరాబాద్‌లో ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ..



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ ప్రారంభమైంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా దీనిని ప్రారంభించారు. అంతరిక్ష స్టార్టప్ స్కై రూట్స్ ఇన్ఫినిటీ క్యాంపస్‌లో మొదటి ఆర్బిటల్ రాకెట్ విక్రమ్ Iని కూడా ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశ పెట్టగల సామర్థ్యం స్కైరూట్ కలిగి ఉంది. ఈ క్యాంపస్ దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ కావడం గమనార్హం. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. స్కైరూట్ టీంకు అభినందనలు తెలిపారు.

## ఏపీ ఫైబర్ నెట్ కేసు క్లోజ్

**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ ఉపశమనం లభించింది. ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సీఐడీ నమోదు చేసిన కేసు అధికారికంగా ముగిసిపోయింది. ఫైబర్‌నెట్ వ్యవహారంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని సీఐడీ స్పష్టం చేయడంతో కేసు మొత్తాన్ని విజయవాడ ఏసీబీ కోర్టు క్లోజ్ చేసింది. 2015లో టీడీపీ ప్రభుత్వ కాలంలో రూ.330 కోట్ల విలువైన ఫైబర్‌నెట్ ఫేజ్-1 వర్క్ ఆర్డర్ టెర్రాసాఫ్ట్ సంస్థకు కేటాయించడంలో టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నమోదైంది.

## ఆధార్ పౌరసత్వానికి ప్రూఫ్ కాదు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా పౌరులు కానివారు ఆధార్ కలిగిఉంటే.. వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా? అని ప్రశ్నించింది. ఓటర్ల జాబితాలకు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

## ఇండోనేసియాలో భూకంపం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం ఆషే ప్రావిన్స్‌కు సమీపంలో 10 కిలోమీటర్ల లోతున నమోదైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటికే వరదలతో ఉక్కిరిబిక్కిరవుతోన్న ఆ దేశాన్ని భూకంపం వణికించింది.

## లాభాలతో ముగిసిన సూచీలు




**అక్షరటుడే, ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాలతో ముగిశాయి. ఇంట్రాడేలో జీవనకాల గరిష్ఠాలకు చేరిన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సూచీలు లాభాల స్వీకరణతో అక్కడి నుంచి కిందకు దిగొచ్చాయి. చివరకు సెన్సెక్స్ 110 పాయింట్లు పెరిగి 85,720 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ 10 పాయింట్ల స్వల్పలాభంతో 26,215 వద్ద ముగిసింది.

## కూకట్‌పల్లిలో హైడ్రా కూల్చివేతలు

**అక్షరటుడే, హైదరాబాద్:** హైడ్రా అధికారులు నగరంలోని పలు చెరువులను పునరుద్ధరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకు వచ్చారు. కూకట్‌పల్లిలోని నల్ల చెరువును సైతం పునరుద్ధరిస్తున్నారు. ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. డిసెంబర్‌లో ఈ చెరువును ప్రారంభించడానికి హైడ్రా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కూకట్‌పల్లి పరిధిలోని నల్ల చెరువు సమీపంలో ఉన్న ప్రకాష్ నగర్ కాలనీలో హైడ్రా గురువారం కూల్చివేతలు చేపట్టింది. కాలనీలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చడానికి హైడ్రా బుల్డోజర్లు రాగా.. స్థానికులు అడ్డుకున్నారు. హైడ్రా సిబ్బందితో వాగ్వాదం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం పోలీసుల సాయంతో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు.


## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం..

**అక్షరటుడే, హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన ప్రత్యక్షంగా కోర్టులో హాజరు కాకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. బతుకమ్మ కుంట కేసులో ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కోర్టు ధిక్కార కేసులో డిసెంబర్ 5న రంగనాథ్ స్వయంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. లేకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని స్పష్టం చేసింది. బతుకమ్మ కుంట రక్షణ, పునరుద్ధరణకు సంబంధించిన గతంలో జారీ చేసిన ఆదేశాలను పాటించకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

**గ్రూప్–2లో ర్యాంకర్లకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2015 నోటిఫికేషన్ ప్రకారం కొలువులు సాధించిన వారి నియామకం చెల్లదంటూ ఇటీవల సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును ద్విసభ్య ధర్మాసనం కొట్టేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2019లో నియామకం అయిన 1,032 మంది గ్రూప్–2 ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ, అభ్యర్థులు సవాలు చేయగా గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు చెప్పింది.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# గ్రూప్–2 ర్యాంకర్లకు ఊరట



- హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు రద్దు
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన డివిజన్ బెంచ్
- 2015 నోటిఫికేషన్ ఉద్యోగుల హర్షం

తెలంగాణ వచ్చిన తర్వాత తొలిసారి 2015లో గ్రూప్-2 నోటిఫికేషన్ వచ్చింది. అనంతరం 2016లో అనుబంధ నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసింది. వివిధ విభాగాల్లోని మొత్తం 1,032 పోస్టుల భర్తీకి 2016 నవంబర్‌లో పరీక్షలు నిర్వహించారు. అయితే నియామక ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగింది. 2016లో పరీక్ష జరగ్గా 2019లో ఫలితాలు వచ్చాయి. అదే ఏడాది నియామక ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది.

**వివాదం ఏమిటంటే..**

గ్రూప్-2 పరీక్ష నిర్వాహణ, మూల్యాంకనంపై అనేక ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాటు, డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగించిన పేపర్లను మూల్యాంకనం చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పట్లోనే పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో సాంకేతిక కమిటీ నివేదిక ప్రకారం మూల్యాంకనం చేపట్టాలని న్యాయస్థానం తెలిపింది. వైట్నర్ వినియోగం, డబుల్ బబ్లింగ్ చేసిన పేపర్లను పరిగణనలోకి తీసుకోవద్దని కమిటీ సూచించింది. అయినా అలాంటి పేపర్లను మూల్యాంకనం చేశారని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ఏకసభ్య ధర్మాసనం నియామకాలను రద్దు చేస్తూ ఈ నెల 18న సంచలన తీర్పు వెలువరించింది. మళ్లీ మూల్యాంకనం చేసి ర్యాంకులు ప్రకటించాలని ఆదేశించింది. 8 వారాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది.

**తీర్పును సవాల్ చేయడంతో..**


హైకోర్టు తీర్పుతో ఆరేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న 1,032 మంది ఆందోళన చెందారు. సింగిల్ బెంచ్ తీర్పుపై వారు అప్పీల్ చేశారు. టీజీపీఎస్సీ సైతం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ర్యాంకులు సాధించి, కొలువులు చేస్తున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నామినేషన్ల ప్రక్రియ షురూ..



**అక్షరటుడే, హైదరాబాద్:** తొలి దశ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. రాష్ట్రంలో మూడు దశల్లో సర్పంచ్ ఎలక్షన్లు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. తొలిదశలో 4,236 గ్రామాలు, 37,450 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైంది. శనివారం వరకు నామినేషన్లు సమర్పించే అవకాశం ఉంది. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయొచ్చు. దీంతో అభ్యర్థులు మంచి ముహూర్తం చూసుకొని నామినేషన్ వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 30న నామినేషన్లను అధికారులు పరిశీలించనున్నారు. డిసెంబర్ 3 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. డిసెంబర్ 11న పోలింగ్ జరగనుంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. కేసీఆర్ ఓఎస్డీని విచారించిన సిట్




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ మళ్లీ విచారణ ప్రారంభించింది. మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు విచారించారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లో అతడిని రెండు గంటల పాటు ప్రశ్నించారు. ఇటీవల హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సజ్జనార్.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసు విచారణ ఏ దశలో ఉంది..? ఇప్పటి వరకు దాఖలు చేసిన ఛార్జ్ షీట్లు తదితర అంశాలపై ఆరా తీశారు. కేసు విచారణపై దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ఓఎస్డీని విచారించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు, నిందితులను ఇప్పటికే పలువిడతలుగా సిట్ విచారించింది. నలుగురు పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేసింది. కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు అప్పట్లో రాధాకిషన్‌రావు చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో ఉంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌కు ఓఎస్డీగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డిని విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది.

## డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించిన అయ్యప్ప స్వాములు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. అయ్యప్ప స్వాములు కార్యాలయం ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు అయ్యప్ప మాల వేసుకోవద్దని ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో పోలీసు ఉన్నతాధికారుల తీరును నిరసిస్తూ గురువారం ఉదయం స్వాములు, బీజేవైఎం కార్యకర్తలు డీజీపీ కార్యాలయ ముట్టడికి బయలు దేరారు. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు స్వాములు యత్నించారు. ఈ క్రమంలో స్వాములకు, పోలీసులకు మధ్య తోపు లాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కొంద రు స్వాములను అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.

## అమెరికాలో వైట్‌హౌస్ వద్ద కాల్పులు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద కాల్పులు చోటు చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఓ వ్యక్తి వైట్‌హౌస్ సమీపంలో నేషనల్ గార్డులపై కాల్పులు జరిపాడు. వైట్‌హౌస్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. అటువంటి ప్రదేశంలో కాల్పులు జరగడంతో అమెరికన్లు ఉలిక్కి పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు నేషనల్ గార్డులు మృతి చెందినట్లు వెస్ట్ వర్జీనియా గవర్నర్ పాట్రిక్ మొరిసే తెలిపారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం వైట్ హౌస్ సమీపంలో కాల్పులు జరిగాయి. పశ్చిమ వర్జీనియాకు చెందిన ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యులపై నిందితుడు తుపాకీతో కాల్పులు జరపడంతో వారు మృతి చెందారు. అప్రమత్తమైన బలగాలు అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నాయి.

## ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం..



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం గాలి నాణ్యత చాలా పేలవంగా ఉందని అధికారులు తెలిపారు. ఏక్యూఐ రీడింగ్ 355గా నమోదైంది. ఢిల్లీఎన్‌సీఆర్ దాదాపు నెల రోజులుగా నిరంతర వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు డేటా ప్రకారం గురువారం ఢిల్లీని విషపూరిత పొగమంచు కమ్మేసింది. గాలి నాణ్యత 'చాలా పేలవమైన' వర్గంలోనే కొనసాగుతోంది. అలాగే కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం పడిపోయాయి. సగటు కనిష్ట ఉష్ణోగ్రత 8.3 డిగ్రీలు నమోదైంది. ఢిల్లీలో గురువారం ఆకాశం స్పష్టంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో భారీ అగ్ని ప్రమాదం.. 1500 ఇళ్లు దగ్ధం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కొరైల్ మురికివాడలో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మంటలు అంటుకొని దాదాపు 1500 గుడిసెలు కాలిపోయాయి. ఢాకాలోని అతిపెద్ద మురికివాడల్లో కొరైల్ ప్రాంతం ఒకటి. మంగళవారం రాత్రి మంటలు అంటుకొని అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. తగరపు పైకప్పు గల గుడిసెల వరుసలు కాలిపోయిన శిథిలాలుగా మారాయని అధికారులు తెలిపారు.

## ట్యాంకర్‌ను ఢీకొట్టిన లారీ.. డ్రైవర్ సజీవ దహనం

**అక్షరటుడే, మహబూబ్‌నగర్:** రాష్ట్రంలో వరుస రోడ్డు ప్రమాదాలు కలవర పెడుతున్నాయి. ఇటీవల యాక్సిడెంట్లు పెరిగాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నా.. ఫలితం ఉండడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ లారీ ఇథనాల్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. హన్వాడ మండలం పిల్లిగుండు వద్ద జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ట్యాంకర్‌ను లారీ ఢీకొనడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో ఇథనాల్ ట్యాంకర్ డ్రైవర్ సజీవ దహనం అయ్యాడు. లారీ డ్రైవర్‌ను స్థానికులు రక్షించారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో మూడు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మళ్లీ ఫామ్‌లోకి మిల్కీ బ్యూటీ..



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతమైన ఫామ్‌లో దూసుకెళ్తోంది. అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. హీరోయిన్ పాత్రలు, స్పెషల్ సాంగ్స్‌తో గ్యాప్ లేకుండా తన కెరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్తోంది. సాధారణంగా హీరోయిన్‌గా కొంతకాలం తర్వాత అవకాశాలు తగ్గిపోతే నటీమణులు విరామం తీసుకుంటారు. కానీ తమన్నా మాత్రం రెస్ట్‌లెస్‌గా, ఎక్కడ అవకాశం వస్తే అక్కడే పనిచేస్తూ అన్ని భాషల్లోనూ తన మార్క్ చూపిస్తోంది. ఈ ఏడాది ఆమె నటించిన ఓదెల 2లో లీడ్ రోల్ అభిమానులను మెప్పించగా, బాలీవుడ్‌లో రెయిడ్ 2లో చేసిన ఐటమ్ సాంగ్ ఆశించిన స్థాయిలో విజిబిలిటీని తెచ్చిపెట్టింది.

– అక్షరటుడే, సినిమా డెస్క్